శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో ఎంపీ వేమిరెడ్డి భేటీ

- ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై మరోసారి చర్చ
- సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- త్వరితగతిన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త** నెల్లూరులో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటును వేగవంతం చేసేలా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ని, ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌ని కలిసిన ఎంపీ వేమిరెడ్డి సోమవారం పార్లమెంట్ భవనంలోకి కేంద్ర మంత్రి కార్యాలయంలో మన్‌సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్రమంత్రి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై సుధీర్ఘంగా చర్చించారు. హాస్పిటల్ ఏర్పాటుకు సంబంధించి అన్ని అంశాలను వివరించారు. ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయినట్లు పేర్కొన్నారు. సిబ్బంది క్వార్టర్స్‌కు కూడా స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు త్వరితగతిన హాస్పిటల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నెల్లూరులో హాస్పిటల్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజా పరిష్కార వేదికకు 566 ఫిర్యాదులు

- ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో మొత్తం 566 ఫిర్యాదులు
- సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను ఆదేశం
- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే. కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖ కూడా ప్రజా ఫిర్యాదులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు విషయంలో ఆడిట్ నిర్వహించుకోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 566 ఫిర్యాదులు అందాయని అందులో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 205 సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 32, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్48, పంచాయతీరాజ్51, స్కూల్ ఎడ్యుకేషన్ 22మరియు పోలీస్ శాఖకు సంబంధించి95 మిగతావి ఉన్నాయన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖ అధికారులకు అందజేసి త్వరితగతిని పరిష్కరించవలసిందిగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కార విషయంలో అలసత్వం ఉండకూడదని తెలిపారు.

## జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెరిగే విధంగా చర్యలు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెరిగే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కోరారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వాణిజ్య పనుల శాఖ మరియు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 40 లక్షల (వస్తువుల) మరియు 20 లక్షల (సేవల) టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలను జి ఎస్ టి పరిధిలోకి తీసుకురావాలని, అటువంటి సంస్థల సమాచారం వాణిజ్య పన్నుల శాఖకు అందించాలన్నారు. అదేవిధంగా మునిసిపల్ కమిషనర్లు, స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ జిల్లా రిజిస్ట్రార్ మరియు రెవెన్యూ అధికారులు పన్ను బకాయిదారుల ఆస్తుల వివరాలను వారికి అందించాలన్నారు. టి డి యస్ మినహాయింపు విషయమై జిల్లా డ్రాయింగ్ డిస్బర్స్మెంట్ అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించాలని సూచించారు. పన్ను లేకుండా సరుకుల రవాణా జరిగే గ్రానైట్ ఇతర సరుకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్ శాఖలు వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ వై. కిరణ్ కుమార్ , డిప్యూటీ కమిషనర్ ఎం. సత్య ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

## డిఐఈఓ గా బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణారెడ్డి



**నెల్లూరు,ఆగస్టు4 ప్రభాతవార్త-విద్య** నెల్లూరుజిల్లా ఇన్‌చార్జ్ డిఐఈఓగా బివి.క్రిష్ణారెడ్డి సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి డిఐఈఓగా పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు. కాగా సోమవారం నగరంలోని స్దానిక కెఏసీ కళాశాల ఆవరణలోని డివిఈఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జూనియర్ లెక్చరర్స్ ఇన్ ఫిజికల్ అసోసియేషన్ తరపున పాటూరు వేణుగోపాల్‌రెడ్డి, జూనియర్ లెక్చరర్స్ అసోసియషన్ ఇన్ లైబ్రరిసైన్స్ బి.బసిరెడ్డి, బాల సుబ్బారెడ్డిలు డిఐఈఓకు పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్ట్ 4, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 13134క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 35.630టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200,ఎన్ఎఫ్‌సికి 370, పెన్నా డెల్టాకు2750, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 93.095మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## మైనింగ్ ఉద్యమనేతలపై అత్యుత్సాహంచూపిన ఎస్ఐ

❖ వత్తిడికిగురై కుప్పకూలిన టిడిపి నేత పీరయ్య ❖ ఆగ్రహంతో స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు ❖ ఎస్ఐను సస్పెండ్ చేయాలంటు నినాదాలు





**వరికుంటపాడు, ఆగష్టు 4, ప్రభాతవార్త** వరికుంటపాడు ఎస్ఐ రఘునాద్ మైనింగ్ ఉద్యమనేతలపై దురుసుగ ప్రవర్తించడంతో ఓ టిడిపి నేత తీవ్ర వత్తిడికి గురై ఆసుపత్రి పాలవడంతో స్థానికులు పోలీస్ స్టేషన్ ముట్టడికి రావడంతో తీవ్రఉద్రిక్త పరిస్తితులు నెలకొన్నాయి. వరికుంటపాడు పంచాయతి జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపానున్న పల్ల తిప్పలో మైనింగ్ తీసేందుకు అనుమతులు వచ్చాయనిదానికి వ్యతిరేకంగ గ్రామస్తులు ఉద్యమాలు చేపట్టారు. ఈక్రమంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా ఆందోళన కార్యక్రమాలలో ముఖ్యపాత్ర నిర్వహించిన వరికుంటపాడు టిడిపినేత షేక్ పీరయ్యను విచారణ నిమిత్తం గత మూడు రోజులుగా విచారణ కోసం స్టేషన్‌కు రావలసిందిగ వత్తిడి చేయడంతోపాటు సోమవారం ఉదయం బస్టాండ్ సెంటర్‌లో టీతాగుతుండగ ముగ్గురు పోలీస్‌సిబ్బంది అతనిని బలవంతంగ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. దీంతో స్థానికులు కొంతమంది పీరయ్యను పోలీసులు తీసుకెళ్ళడాన్ని గమనించి స్టేషన్ వద్దకు వెళ్ళారు. పోలీసులు పీరయ్య ఒక్కరిని మాత్రమేస్టేషన్ లోనికి తీసుకెళ్ళి మిగిలిన వారిని స్టేషన్ బయట వుంచడంతో అక్కడ ఏంజరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది ఎస్ఐ రఘునాద్ పీరయ్యచేత 41నోటీస్‌పై సంతకం చేయించే ప్రయత్నం చేయగా అదేంటో తెలియని పీరయ్య భయపడుతు ఎస్ఐ గదినుంచి బయటకు వచ్చారు. దీంతో ఆవేశానికి గురైన ఎస్ఐ పీరయ్యను బలవంతంగా లోపలికి తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు. గుండె సంబందిత ఫేషెంట్‌గా వున్న పీరయ్య తీవ్ర వత్తిడికి లోనై చాతినొప్పి అంటు స్టేషన్ బయట వున్న బల్లపై కుప్పకూలారు. దీంతో అక్కడేవున్న గ్రామస్తులు ఆందోళన చెంది 108 వాహనంద్వార పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాదమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం ఒంగోలు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడనుండి విజయవాడ ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**ఆగ్రహించిన గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ముట్టడి :** ప్రజల మనిషిగ పేరొంది మైనింగ్‌కు వ్యతిరేకంగ పోరాడుతున్న పీరయ్యను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్ళడం ఆపై గుండెపోటు విచ్చిందనే విషయం గ్రామస్తులకు తెలియడంతో మహిళలు యువకులు స్థానిక రామాలయం వద్ద ప్రత్యేకపూజలుచేసి ఆయన కోలుకోవాలని వేడుకున్నారు. అనంతరం పెద్దఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని పీరయ్యని ఇబ్బందులకు గురిచేసిన ఎస్ఐను నిలదీసేందుకు మహిళలు యువత స్టేషన్‌లోకి వెళ్ళేందుకు ప్రయత్నం చేయగ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మరింత కోపోద్రికులైన వారు పోలీసులను తోసుకుంటు ఎస్ఐని సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేస్తు స్టేషన్ లోపలికి ప్రవేసించి ఎస్ఐ గదిలోకి వెళ్ళే ప్రయత్నం చేశారు. ఈప్రయత్నంలో ఎస్ఐ బయటకు రాకపోవడంతో మహిళలు స్టేషన్ ఎదుటే బైటాయించారు. పరిస్థితి తీవ్రమౌతున్న సందర్బంలో ముగ్గురు సిఐలు, ముగ్గురు ఎస్ఐలతో పాటు సిబ్బంది ఎక్కువ మంది స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన కారులను కట్టడిచేసే ప్రయత్నం చేశారు. జోరువర్షాన్ని సైతం లెక్కచేయకుండ మహిళలు స్టేషన్ వద్దే ఆందోళన కొనసాగించడం కొసమెరుపు. భాదిత పీరయ్య కుటుంబ సభ్యులు స్టేషన్ వద్దకు వచ్చి పీరయ్యను ఎందుకు స్టేషన్‌కు తీసుకొచ్చారంటూ తీవ్ర ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘునాద్ వివరణ ఇస్తు ఉద్యమంలో వున్న 8మందిపై కేసులు నమోదు కావడంతోనే అందులో భాగంగ విచారణ నిమిత్తం పీరయ్యను తీసుకొచ్చినట్లు తెలిపారు. అయినప్పటికి మహిళలు యువకులు మాపీరయ్యను మాకు చూపించండి అంటు నినాదాలు చేస్తు వుండడంతో సిఐలు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. డిఎస్‌పి వస్తున్నారన్న సమాచారంతో యువకులు మహిళలు అక్కడినుంచి రాత్రి 8 దాటిన వెళ్ళకపోవడం పోలీసులు నేతలను ఎంత ఇబ్బందిపెట్టారో ఇట్టే అర్దమౌతుంది. మైనింగ్ విషయం కాబట్టి రెవెన్యూ అదికారులను సంప్రదించాలని సిఐలు సూసించడంతో గ్రామస్తులందరు వర్షంలోనే తహసిల్‌దార్ హేమంత్‌కుమార్‌ను కలసి మైనింగ్‌పై నిలదీశారు. తహసిల్‌దార్ మాట్లాడుతు అదికారికంగ మైనింగ్ అనుమతులు రాలేదని ప్రజాభిప్రాయ సేకరణ మాత్రమే నిర్వహించామన్నారు. మీకేమైనా అభ్యంతరాలు వుంటే లిఖితపూర్వకంగ అర్జీలిస్తే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఏదేమైన మైనింగ్ విషయం పోలీసులు అత్యుత్సాహం చూపడంపట్ల మండలంలో చర్యనియాంశంగ మారింది.

**బాదితుడికి ఎంఎల్ఏ పరామర్శ :** వరికుంటపాడు గ్రామ టిడిపి కార్యకర్త షేక్ మీరయ్యకు పోలీస్ స్టేషన్‌లోనే హార్ట్ స్టోక్ వచ్చిన విషయం తెలుసుకున్న ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పీరయ్య కుటుంబ సభ్యులకు పోన్‌చేసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసరమైతే తీనే వైద్యశాలకొచ్చి అండగా వుంటానని హామీ ఇచ్చారు. వైద్యశాల వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూసించారు. ఏసమస్య వున్న తన దృష్టికి తీసుకురావాలని కుటుంభ సభ్యులు ఎవ్వరు అధైర్యపడవద్దని ధైర్యం నింపారు.

## రైతు సమస్యలను తక్షణం పరిష్కరించండి

### జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన వైసిపి నాయకులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** రైతు సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైసిపి నాయకులు సోమవారం తిక్కన ప్రాంగాణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో జెసి కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యల తీసుకోవాలని కోరుతు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, జిల్లా వైఎస్ఆర్సిపి ఇన్చార్జి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సమయానికి వర్షాలు కురిసి, రైతులు పంటలు బాగా పండించుకుంటూ ప్రభుత్వం నుంచి రైతులు అందిస్తున్న సహకారంతో అనుకున్న సమయానికి రైతులకు విత్తనాలు ఎరువులు, అందిస్తూ ఎలాంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులు ఎంతో సుభిక్షంగా ఉండేందుకు దోహదపడిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన 2014 - 19 ఐదేళ్ల కాలంలో వర్షాలు లేక రైతులు భూములను అమ్ముకొన్న పరిస్థితులు మనందరం చూసామన్నారు. ఈ రోజు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికి వదిలేసి ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం వారిని ఏ విధంగా ఇబ్బంది పెట్టాలో అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ రాక్షస పాలన సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన వెంటనే.. అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20 వేల రూపాయలు అందిస్తామని చెప్పి, గత ఏడాది రైతులను కుటమి ప్రభుత్వం దగా చేశారని మండిపడ్డారు. గత ఏడాది అన్నదాత సుఖీభవ కింద 20 వేలు ఈ ఏడాది మరో 20 వేలు మొత్తం 40 వేల రూపాయలు అందించాల్సి ఉండగా, టిడిపి ప్రభుత్వం 7 వేల మంది రైతులకు కొత్త విధించి కేవలం రైతులకు 5 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం 60 మంది రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందించారా చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతులు ఒక్కరికి కూడా ఒక్క రూపాయి కూడా అందించింది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు ఎరువులు పురుగు మందులు సకాలంలో అందించాలని బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ మేరీగి మురళీధర్, నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి కరివేటి సంజీవయ్య, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

- 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ
- సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుటకు ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు భాధ్యతతో నిర్వహించాలన్నారు. అందరు అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా విద్యా శాఖాధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ ను శోభాయమానంగా అలంకరించాల్సి ఉందిగా సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకునే విధంగా ఉండేట్లుగా సంగీత కళాశాల, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేట్లుగాను, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల నమూనాలను ప్రదర్శించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, ఆర్డిఓ అనూష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌ల ఏర్పాటు

### ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**నెల్లూరు రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త** జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ దేశంలో పరిశ్రమ సహాయంతో దాదాపు 40 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాటు చేసిందనేది వాస్తవమా అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆరా తీశారు. సోమవారం లోక్‌సభలో ఈ మేరకు సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌ల ఏర్పాటుపై పలు ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా వారీగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సిల వివరాలు కోరారు. వివిధ రంగాల శిక్షణ ప్రదాతలకు ఎన్ఎస్‌డిసి ఇస్తున్న మద్దతు, రాష్ట్రంలోని సంబంధిత రంగాలకు అందించబడిన సహాయం వివరాలు ఆరా తీశారు.

**ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు** కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖఆధ్వర్యంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ దేశ వ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎస్ఎస్‌సిలు సంబంధిత రంగాల నైపుణ్యాభివృద్ధి అవసరాలను గుర్తించడంతో పాటు నైపుణ్య సామర్థ్య ప్రమాణాలను నిర్ణయించడం తప్పనిసరి. ఎస్ఎస్‌సిలు ఎప్పటికప్పుడు నైపుణ్య అంతరాల అధ్యయనాలను నిర్వహిస్తాయని, అవసరమైన నైపుణ్యాలపై సమాచారాన్ని అందిస్తాయన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని సిద్ధం చేసే క్రమంలో ప్రభుత్వానికి ఈ అధ్యయనాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఎస్ఎస్‌సిలు దేశవ్యాప్తంగా పనిచేస్తాయని, ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్, ।గి।గ్లీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఇండియన్ ఐరన్ స్టీల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ అనే 4 ఎస్ఎస్‌సిలు తమ ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమించి పనిచేయిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల్లో ఎస్ఎస్‌సిలు నైపుణ్య అంతర అధ్యయనాలు చేశాయని వివరించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ ఇండియా మిషన్ కింద అక్రిడిటేషన్, సామర్థం పెంపు, ఫెసిలిటేషన్ సెంటర్ వంటి మద్దతును అందిస్తుంది. ఇందులో స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ ద్వారా శిక్షణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ సాధ నాల వినియోగం, నేషనల్ ఆక్యుపేష నల్ స్టాండర్డ్స్‌తో పాఠ్యాంశాల అమరిక, ప్లేస్‌మెంట్ లింకేజీలు వంటివి ఉన్నాయ న్నారు. ఎన్ఎస్‌డిసి ఆంధ్ర ప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ, నిర్మాణం, లాజిస్టిక్స్, రిటైల్ వంటి రంగాల్లో భాగస్వామ్యం కలిగి ఉందని సమాధానం ఇచ్చారు.

## అనిల్ కుమార్ యాదవ్‌తో కీలక నేతల భేటీ



**నెల్లూరు రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ని పలువురు వైఎస్ఆర్సీపి ముఖ్య నాయకులు కలిసి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. నెల్లూరు ఇస్కాన్ సిటీలోని అనిల్ కుమార్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, వైఎస్ఆర్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నెల్లూరు సిటీ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్, నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, సులూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ కిలివేటి సంజీవయ్య మరియు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాని పూజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్రమ కేసు, విచారణ పర్యవేక్షణ, పార్టీ నేతల మద్దతు తదితర అంశాలపై నేతలు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. పార్టీ తరఫున అనిల్ కుమార్ యాదవ్‌కు పూర్తి మద్దతు ఉంటుందన్న సంకేతాలు ఈ భేటీలో వెల్లడయ్యాయి.

## ఏపీలో పెట్రోలియం, గ్యాస్ రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వండి

– కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఎంపీల విజ్ఞప్తి పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
– రామాయపట్నం వద్ద బీపీసీఎల్ ఏర్పాటుకు సహకరించాలని వినతి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలియం, గ్యాస్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇంధన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు వివిధ ప్రతిపాదనలను వేగవంతం చేయాలని టిడిపి ఎంపీల బృందం సోమవారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలిసి విన్నవించారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా ఇతర ఎంపీలు రాష్ట్రానికి సంబంధించిన మూడు కీలకమైన ప్రతిపాదనలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటి ద్వారా రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధితోపాటు సామాజిక సంక్షేమ అభివృద్ధి జరుగుతుందన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని రామయపట్నం వద్ద బిపిసిఎల్ రిఫైనరీ ఏర్పాటును వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. దాంతోపాటు వీవిబిది జాక్అప్ రిగ్ కాంట్రాక్టును ఇవ్వడానికి హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 65.40 లక్షల మంది దీపం లబ్ధిదారులందరినీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద తగిన ప్రయోజనాలను అందించాలని కోరారు. ఈ ప్రతిపాదనలు జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉంటాయని, జాతీయ ఇంధన భద్రతకు ఉపయోగపడతాయని, కాబట్టి సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## ఏఎంసి చైర్మన్‌గా గాలి బాధ్యతలు స్వీకరణ

## సన్మానించిన టిడిపి నాయకులు



**మనుబోలు ఆగష్టు 4 ప్రభాతవార్త :** ఏఎంసి చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టడంతో మనుబోలు మండల టిడిపినేతలు ఆయనకు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా రామకృ ష్ణారెడ్డి మాట్లాడుతు తనపై అపార నమ్మకంతో ఇంతటి బాధ్యతలు అప్పగించిన సర్వేపల్లి శాసనస భ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమ ంలోటిడిపినాయకులు ముం గర విజయ్‌బాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సాని వెంకటర మణ య్య, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చిట్టిబాబు, శివుడు రాజా గౌడ్, అమీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదుల స్వీకరణ



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** జిల్లా ఇంచార్జి ఎస్పి ఎ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సౌజన్య సూచనల మేరకు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం సోమవారం ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 84 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వెంకటాచలం పరిధికి చెందినటువంటి రైతులను, దళారి ముని కృష్ణయ్య రూ. 29 లక్షలు విలువ గల పంటను లారీల్లో తీసుకెళ్లినట్లు, రావాల్సి న బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తున్నట్లు, విచారించి న్యాయం చేయాలని కోరారు. సంగం పరిధిలోని మామిడి తోట యజమాని యూసఫ్ అనే వ్యక్తి, తన మామిడి తోటలో కాపలాదారుగా ఉన్నటువంటి మహిళ వెంటపడుతూ, డబ్బు బంగారం ఆశ చూపిస్తూ వేధిస్తున్నట్లు, అదేవిధంగా తన స్నేహితులతో కలిసి బలత్కరించినట్లు, శారీరకంగా వేధించినట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ సింధు ప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె. సిహెచ్. రామారావు, లీగల్ అడ్వైజర్ టి. శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి2సిఐ బి.శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం



**అనుమసముద్రంపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త :** ఆగస్ట్ 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల దివ్య ఆశీసులతో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞానవేదిక పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో అనుమసముద్రంపేట మండలంలోని పొనుగోడు, నదిపురం, తాతిరెడ్డిపల్లి, పమిడిపాడు, రాజవోలుగ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడే అవతరించి ఒక మనిషజగా జన్మిస్తే ఆయన్ను భగవంతుడు అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని ఆయన్ను మాత్రమే దైవంగా గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి.పెంచలనరసయ్య, బి.కృష్ణయ్య, ఇ.పద్మ, ఇ.శేషాద్రి, టి.నరసారెడ్డి, టి.కల్పన, టి.భాగ్యమ్మ, ఎం.పెంచలస్వామి, కె.హరిప్రసాద్, వై.పెంచలయ్య, సి.హెచ్.పద్మ, పి.మధు, పి.కిషోర్, పి.గాయత్రి పాల్గొన్నారు.

## ఎర్రచందనం ముద్దాయిలు అరెస్ట్

**కలిగిరి, ఆగష్టు 4, ప్రభాతవార్త;** ఎర్రచందనం దొగిలించిన కేసులో ముద్దాయిల్ని అరెస్ట్‌చేసి కోర్టుకు పంపినట్లు కలిగిరి యస్ఐ ఉమాశంకర్ తెలిపారు. సోమవారం విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి ఎర్రచందనం కేసు వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా యస్ఐ మాట్లాడుతూ 2025 జనవరి 25వ తేదీన కలిగిరి మండలం తూర్పు దూబగుంటలో అగ్రిగోల్డ్ భూముల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రచందనం దుంగలు నరికి నట్లు ఆ భూములకు సంభందించిన వారు పిర్యాదు చేయడం జరిగిందనానరు. పిర్యాదును పురస్కరించుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలో పోలీస్‌శాఖ జరిపిన విచారణలో నెల్లూరు జిల్లా ,ఉలవపాడు మండలం ,కరేడు గ్రామానికి చెందిన నల్లపురెడ్డి అజిత్‌రెడ్డి, నెల్లూరు జిల్లా కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన పతాకమూరి శ్రీహరి, అదేగ్రామానికి చెందిన పతాకమూరి నిరంజన్ సాయికుమార్, నెల్లూరు జిల్లా బోగోలుమండలం ,కోవూరు పల్లికి చెందిన త్మకూరి రాజేష్ లను అదుపులోకి తీసుకొని కలిగిరి సిఐ వెంకటనారాయణ ఆద్వర్యంలో ముద్దాయిలను సోమవారం అరెస్ట్‌చేసినట్లు యస్ఐ తెలిపారు.

## నేడు నీటిసరఫరాకు అంతరాయం

**ఆత్మకూరు, ఆగస్ట్4, ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని 4,5,6,7,8,9,10,11,13,15,16 ,17,18 వార్డుల్లో మంగళవారం నీటిసరఫరాకుఅంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపాల్టీలో ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ క్లీనింగ్, మోటార్స్ మెయిన్‌టినెన్స్ దృష్ట్యా పట్టణంలోని 13వార్డుల్లో నీటికి అంతరాయం ఏర్పడుతుందని, బుధవారం నుండి యధావిధిగా నీటిసరఫరా జరుగుతుందని గంగాప్రసాద్ తెలిపారు.

## ప్రభుత్వ ఫోన్‌లను వాపసు చేసిన అంగన్‌వాడీలు



**ఆత్మకూరు , ఆగస్ట్3, ప్రభాతవార్త :** ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లను సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో వాపసు చేశారు. ఈ ఫోన్‌లు సక్రమంగా పనిచేయకపోవడం, ప్రభుత్వం ఆన్‌లైన్ యాప్‌లను అమలు చేస్తుండడంతో వారంతా విసిగి వేసారి ప్రాజెక్ట్ పరిధిలోని 255మంది తమ ఫోన్‌లను వాపసు చేసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.రాధ ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపాల్టీ, ఆత్మకూరు , ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు , సిఐటియు జిల్లా నాయకులు జి.శివప్రసాద్ , హజరత్తయ్య, డేవిడ్‌రాజ్, యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ , సెక్టార్ స్థాయి లీడర్లు , అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లి లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి

– జిల్లా పరిస్థితులపై అధినేతకు వివరాలు



**నెల్లూరు రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాలోని తాజా రాజకీయ పరిణా మాలు, పార్టీ కార్యకలా పాలపై నేతల మధ్య విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన గురించి అధినేత అడిగినప్పుడు, ఆ కార్యక్రమం 11 నియోజకవర్గ ఇన్‌చార్జిల సమిష్టి కృషితో భారీ విజయవంతంగా నిర్వహించబడిందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తెలుగుదేశం ఆంక్షలు విధించి, రోడ్లు తవ్వించినా కూడా 25 వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చి నాయకుడిని కలిసి కార్యక్రమాన్ని ఘన విజయంగా మార్చారని ఆయన వివరించారు. ఈ విజయాన్ని మున్ముందు కార్యకర్తల ఉత్సాహంగా మలిచేలా చేసేందుకు చర్చలు సాగినట్టు తెలిపారు. అదే విధంగా, నెల్లూరు జిల్లాకు అధినేత వచ్చినందుకు జిల్లా కార్యకర్తలంతా కృతజ్ఞతలు తెలియజేసిన విషయాన్ని కూడా చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. ఈ భేటీలో పార్టీ బలోపేతంపై కూడా చర్చ జరిగింది. పార్టీ పటిష్ఠతను పెంచేందుకు అవసరమైన కొన్ని మూల్యవంతమైన సూచనలు, మార్గదర్శకాలను జగన్ ఇచ్చినట్టు ఎమ్మెల్సీ వెల్లడించారు.

## సమస్యలపై అర్జీలు స్వీకరణ కె.స్ఫూర్తి



**కొడవలూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మండలంలోని ప్రజలు పలు సమస్యలపై సోమవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను తహసిల్దార్ కార్యాలయం చేరుకుని తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పై అధికారుల ఆదేశాల మేరకు తగిన పరిష్కారం జరుగుతుందని ఆమె తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి వచ్చే ఆదేశాలను డీలర్లు రేషన్ సరుకులను సకాలంలో అందించకపోవడం ద్వారా స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులను డీలర్లు సకాలంలో అందిస్తున్నారా లేదా తెలుసుకోవాల్సి న బాధ్యత ఉంది అలా లేని ఎడల పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. గ్రామ రెవెన్యూ అధికారులకు అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సుబ్బారావు, వ్యవసాయ అధికారిని, మండల విద్యాశాఖ అధికారిని వసంత కుమారి, ఏపిఎం కృష్ణవేణి, ఏవో రాంప్రసాద్, ఈ ఓ పి ఆర్ డి ఏఈ, పి ఆర్ ఏ ఈ, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## ఆగ్రోస్ కార్యాలయ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించిన మాలేపాటి



**కావలిరూరల్, ఆగష్టు4, ప్రభాతవార్త:** తాడేపల్లిలోని ఆగ్రోస్ కేంద్ర కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో సోమవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డవలప్‌మెంటు కార్పోరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆగ్రోస్ సంస్థ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యాచరణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం తగిన సూసనలు సలహాలు ఇచ్చారు. ప్రతివక్కరు కష్టపడి నిజాయితీగ పనిచేసి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి మంచిపేరు తీసుకురావాలని మాలేపాటి కోరారు. ఈకార్యక్రమంలో ఆగ్రోస్ కేంద్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నివేదికను వెంటనే అందజేయాలి



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు తీసుకుని ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారి వివరాలను గుర్తించి నివేదికను వెంటనే అందజేయాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా అర్హత కలిగిన వారు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారికి ఇళ్ల స్థలాలు అందించేందుకు గతంలో ఇళ్ల పట్టాలు తీసుకుని పనులు ప్రారంభించిన వారి వివరాలను వెంటనే అందజేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జాబితాను వీలైనంత త్వరగా అందజేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## సదరంకు వచ్చే వారు నిర్ణీత పత్రాలతో రావాలి



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం స్లాట్ బుక్ చేసుకుని పరీక్ష నిమిత్తం వచ్చే రోగులు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న దృవీకరణ పత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని డాక్టర్ ఎన్. అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం స్లాట్ బుక్ చేసుకున్న వికలాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి దగ్గర ఉన్న దృవీకరణ పత్రాలను ఆధార్‌తో కలిపి జెరాక్స్ తీసుకుని రావాలన్నారు.

## ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా



**(లేగుంటపాడు)కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** బిడ్డకు ముర్రుపాలే మొదటి టీకా అని ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పెంచే పోషకాలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు సెక్టార్ పరిధిలోని లేగుంటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంత మంది మహిళలు బిడ్డకు పాలిస్తే రొమ్ము క్యాన్సర్ వస్తుందనే అపోహ ఉందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే సింధు, ఏఎన్ఎం కళావతి, ప్రసన్న లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుజాతమ్మ, అపర్ణ, మనీషా, ఆశాలు తులసి, సుమ ఉన్నారు.

## ఫోన్‌లు ఇచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు



**అనంతసాగరం, ఆగస్ట్4, ప్రభాతవార్త :** అనంతసాగరం లో ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం ప్రాజెక్టులోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఫోన్‌లను వాపసు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు నాగమణి, లక్ష్మి, సునీత, సిఐటియు నాయకులు అన్వర్‌బాషాల ఆధ్వర్యంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లను వాపసు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లతో తమ యాప్‌లో ఇన్ఫర్మేషన్ అప్‌లోడ్ చేయలేక నానా అవస్థలు పడి విసిగి వేసారి తమ ఫోన్‌లను కార్యాలయానికి వాపసు చేశారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు అన్వర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైన అంగన్‌వాడీ కార్యకర్తల అవస్థలను తీర్చేలా 5జిబి ఫోన్‌లను అందజేసి వారి కష్టాలను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అనంతసాగరం, మర్రిపాడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దు

– సీపీఎం నిరసన




**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఇళ్లకు అదాని స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. మోహన్‌రావు తెలిపారు. అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్‌బాబు మీ ఇళ్లకు పొలాల వద్దకు వచ్చి స్మార్ట్ మీటర్లు బిగించాలని ఎవరైనా వస్తే వాటిని పగలకొట్టాలని పిలుపునిచ్చారన్నారు. నేడు అధికారంలోకి వచ్చాక మంత్రి మాట తప్పడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే అదనపు చార్జీల పేరుతో అధికంగా విద్యుత్ బిల్లులు వసూలు చేయడం వలన పేద మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలు చీకట్లో మగ్గాల్సిందే అన్నారు. అదానికి లాభాలు చేకూరాలని ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలకు సీపీఎం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శేషయ్య, బుజ్జయ్య, ఎస్‌కే బాబు, అఫ్రోజ్ , హరి, పెద్దన్న, శ్రీనివాసులు, విజయకుమార్, చాన్‌బాషా, తదితరులు ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డకు సంజీవని



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** పుట్టిన బిడ్డకు వెంటనే పాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం అంగన్‌వాడీ-2లో సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల యొక్క ఆవశ్యకతపై వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో ఉండే పోషకాలు బిడ్డలకు ఆరోగ్య వంతంగా చేస్తుందని , తల్లిపాలే బిడ్డకు సంజీవని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## నేడు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** కోవూరులోని పాత సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆధునీకరణ పనులు చేస్తున్న దృష్ట్యా కోవూరు మండల పరిధిలోని గీతాంజలి 11 కేవీ ఫీడర్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11 కేవీ , గీతాంజలి ఫీడర్ పరిధిలోని పెద్ద పడుగుపాడు, గంగవరం, పోతిరెడ్డిపాలెం, నేతాజీనగర్, కోనమ్మతోట ప్రాంతాల్లో పై వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదని, అత్యవసర విభాగానికి సంబంధించిన వారు ముందస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## కొత్త ఫోన్లు ఇచ్చి వేతనాలు పెంచితేనే ఆన్‌లైన్‌లో పనిచేస్తాం



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యా లయంలో సోమవారం కోవూరు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం గతంలో తమకిచ్చిన సెల్‌ఫో న్లను సోమవారం కట్ట కట్టి బస్తాలో కార్యాలయంలో బల్లపై ఉంచారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వై. సుజాతమ్మ మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి కొత్త ఫోన్లు వస్తున్నాయని, యాప్‌లు తగ్గిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ పరిస్థితి లేదన్నారు. రోజురోజుకూ కొత్త యాప్‌లు పెంచుకుంటూ పోతే అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. అదేవిధంగా చాలీచాలని జీతాలతో తాము పనిచేస్తున్నామని, కనీస వేతనం 26 వేలు కానీ, తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా 18 వేలు అయినా ఇవ్వాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. కొత్త ఫోన్లు ఇచ్చి వేతనాలు పెంచితేనే ఆన్‌లైన్‌లో పనిచేస్తామని ఈ సందర్భంగా వారు తీవ్రంగా పేర్కొన్నారు. అనంతరం సెల్‌ఫోన్లు కట్ట కట్టి ఒక సంచిలో వేసి కార్యాలయంలో సీడీపీవో టేబుల్ మీద పెట్టారు. ఈ కార్యక్రమంలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## పరీక్షల బుక్‌లెట్లలోనే పరీక్షలు



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నఅన్ని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు రెండు ఎస్ఏలు, నాలుగు ఎఫ్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ప్రతి పరీక్షకు ప్రశ్నాపత్రంతో పాటు జవాబులు రాసేందుకు కాగితాలు ఇస్తుండేవారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో వచ్చిన నూతన మార్పుల కారణంగా ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని రకాల పరీక్షలకు సమాధానాన్ని రాసేలా ఒక బుక్‌లెట్‌ను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా రూపొందించి ఇప్పటికే వాటిని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు పంపే ఏర్పాటు కూడా చేపట్టారు. ప్రధానంగా ఈ బుక్‌లెట్‌లో ఏయే పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు అనే వివరాలతో పాటు ఓఎంఆర్ షీట్‌ను ఏ విధంగా నింపాలి.. ప్రశ్నలకు జవాబులు ఏ విధంగా రాయాలో అనే విషయాలతో కొన్ని పేజీలను కూడా ఈ బుక్‌లెట్‌లో విద్యాశాఖ ముద్రించడం జరిగింది. ప్రాథమిక తరగతులకు ఇచ్చే బుక్‌లెట్‌లో 50 పేజీలు, ప్రాథమికోన్నత పాఠశాలకు ఇచ్చే బుక్‌లెట్‌లో 70 పేజీలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ గతంలో పరీక్షా పత్రాలతో పాటు జవాబు రాసేందుకు పేపర్లు కూడా ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి చెప్పి ప్రస్తుతం పరీక్షా బుక్‌లెట్లు వచ్చాయన్నారు. ఈ నెల 11వ తేది నుంచి ఎస్ఏ-1 పరీక్ష జరగనున్న నేపథ్యంలో కోవూరు మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ బుక్‌లెట్లు పంపడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి ఉన్నారు.




## ఉలవపాడులో గడపగడపకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ



**ఉలవపాడు, ఆగష్టు 4, ప్రభాతవార్త** గ్రామ పంచాయతీ పరిధిలోని వరిగచేను సంఘంలో సోమవారం గడపగడపకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు వరిగచేను సంఘంలో గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మీ, పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెలిచర్ల ధనకోటి, నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు మర్లపాటి ఆదాం, నియోజకవర్గ యువజన అధ్యక్షులు మద్దసాని నవీన్, జిల్లా ఐటీ వింగ్ సెక్రటరీ కోర్ట్ కోటయ్య, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ వెలిచర్ల చంద్రశేఖర్, హెచ్‌ఈసీ మెంబర్ అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, సయ్యద్ దస్తగిరి, మండల కమిటీ సభ్యులు వేమూరి వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు స్వయంపాకుల చంద్రమౌళి, ఎర్రజొన్న మాధవరావు, వార్డు మెంబర్లు సీహెచ్ సుజాత, ఎం.ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ ఎం.పాపమ్మ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీప కోటయ్యకి వైసీపీ నాయకులు ఘన నివాళి

**ఉలవపాడు, ఆగష్టు 4, ప్రభాతవార్త :** మాజీ జడ్పీటీసీ సీనియర్ నాయకులు డీప కోటయ్య మృతి చెందటం బాధాకరమని వైసీపీ నాయకులు నన్నం పోతురాజు అన్నారు. మృతి చెందిన కోటయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే ఖాదర్ భాషా, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, షేక్ దస్తగిరి ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం



**ఉలవపాడు, ఆగష్టు 4, ప్రభాతవార్త :** ఉలవపాడు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ బొల్లినేని సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలలో హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని అందరూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## అమ్మ పాలతోనే ఆరోగ్య సమాజం



**వింజమూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండె మడకల మెయిన్, ఎస్సీ కాలనీ, పంచాయతీ పరిధిలోని చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని గుండె మడకల మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ పద్మజా కుమారి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ తేజస్విని పర్యవేక్షణలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్త మాలేపాటి రాధ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది తల్లిపాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి తల్లిపాల సంస్కృతి ప్రోత్సహానికి ప్రాధాన్యతనిద్దాం అనే నినాదంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవంను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తల్లిపాలతోనే ఆరోగ్య సమాజాన్ని నిర్మించేందుకు వీలవుతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు బిడ్డకు చాలా శక్తివంతమైనదని, అంతే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అరగంట లోపల తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాద స్థాయి తగ్గిస్తుందని గర్భాశయం అండాశయంలో క్యాన్సర్‌ను నిరోధిస్తుందని కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల తల్లి బిడ్డకు ఎముకల వ్యాధి నియంత్రణకు దోహదపడుతాయని తెలిపారు. నవజాత శిశువు జన్మించిన తర్వాత తల్లికి వచ్చే ముర్రుపాలు బిడ్డకు తప్పక తాగించాలన్నారు. అందులో ఎన్నో పోషకాలు విటమిన్లు ఉంటాయని పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమని తెలిపారు. మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఏడో నెల నుండి బిడ్డకు ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వడం ప్రారంభించాలన్నారు. అలాగే పాలిచ్చే తల్లిని వారి కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రతి రోజు భవనంలో అన్ని రకాల పోషక ఆహారాలు ఇవ్వాలన్నారు. గర్భిణీ స్త్రీలకు గంటా లేదా రెండు గంటలు విశ్రాంతి ఇవ్వాలన్నారు. చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెంచే గుణం తల్లిపాలలో ఉందన్నారు. ఊబకాయం కూడా నిరోధించడమే కాకుండా మొదడు చురుకుగా పని చేసే విధంగా తల్లిపాలు దోహదపడతాయని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యప్రదాయంగా పని చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రకృతి శ్రీదేవి, తల్లులు, చిన్నారులు తదితరులు ఉన్నారు.

## బోగోలులో సివిల్ సప్లైస్ డీటీ తనిఖీలు



**బిట్రగుంట ఆగష్టు 4 ప్రభాతవార్త:** బోగోలు మండలం లోని పడమర పల్లెలలో సోమవారం కావలి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఎం. విజయమ్మ పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీలలో సమయపాలన, పంపిణి తీరు,వినియోగదారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

## యూరియ అధికధరలకు విక్రయిస్తే చర్యలు

**జలదకి, ఆగష్టు4, ప్రభాతవార్త:** యూరియాను అదికధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వింజమూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం శేషగిరి హెచ్చరించాడు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయాదికారిణి శ్రీవాణితో కలసి ఆయన మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగ ఆయన మాట్లాడుతు యూరియాను అదిక ధంలకు విక్రయించరాదని ఆదేశించాడు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. యూ రియ కాని ఇతర ఎరువుల సరఫరాలో ఎమైన ఇబ్బందులు వుండే తమ దృష్టికి తీసుకురావాలని సూసించాడు.

## నేటి నుండి ఏపిజిఈఎ ఆధ్వర్యంలో "రండి.. టీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" కార్యక్రమం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 4, ప్రభాతవార్త :** ఉద్యోగులను ఉద్దేశించిన కార్యక్రమం వివిధ ఆఫీసుల్లో వీడియో ప్రదర్శనతో ప్రారంభంఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉద్యోగుల డిమాండ్స్ కొరకు రాజీలేని పోరాటం చేస్తూ ఉద్యోగుల హక్కులే లక్ష్యంగా అనగా పిఆర్‌సి, డిఏ, ఆర్జిత సెలవు తదితరాల రూపంలో ఉద్యోగులకు బకాయిలుగా ఉన్న 30 వేల కోట్ల రూపాయల బకాయిల సాధన మరియు ప్రధానమైన ఇతర డిమాండ్స్ సాధన కొరకు ఏపిజిఈఎ రాష్ట్ర అధ్యక్షులు కె. ఆర్. సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా ఒక విన్నూతన కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగుల కొరకు చేపట్టారు. ఆ కార్యక్రమమే …"రండి టి…తాగుతూ మాట్లాడుకుందాం". ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యల పై మరియు పరిష్కార మార్గాలపై ఒక వీడియో రూపంలో ఉద్యోగుల ముందుకు ఏపిజిఈఎ తీసుకురానున్నది. 5 వ తేదీ సాయంత్రం నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకాల స్థాయిలో వారానికి ఒకరోజు ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులతో ఏపిజిఈఎ ఆధ్వర్యంలో "రండి.. టీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" కార్యక్రమం జరుగనుంది. నెల్లూరు గ్రామీణంలో ప్రభుత్వ సార్వజనాసుపత్రి నెల్లూరు సిటీ యూనిట్ లో ఎంపిడిఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి సుధాకరరెడ్డి, రాంప్రసాద్ ల ఆధ్వర్యంలో ప్రారంభం కానుంది. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ లకు పేరుకుపోయిన ఆర్థిక బకాయిలను పొందేందుకు నూతన మార్గాలు తిశిబినితి సూచించనున్న వీడియో ఈ కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమానికి ఆయా కార్యాలయాలలోని, సమీప కార్యాలయాలలోని ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై, కార్యక్రమంలో ప్రదర్శించే వీడియో అనంతరం వారి అభిప్రాయాలు మరియు సూచనలు తెలియజేయాలని ఏపిజిఈఎ జిల్లా కార్యవర్గం కోరుతున్నది. తదుపరి ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగుల సమస్యల పరిష్కారమార్గాలు సూచిస్తూ ఏపిజిఈఎ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి నూతన ప్రతిపాదనలు తీసుకువెళ్లనుంది.

## దొంగలకు దొరకని మందు సీసాలు



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయతీలో ఉన్న మహాలక్ష్మీపురం సమీపంలో ఉన్న బ్రాందీ షాపులో ఆదివారం రాత్రి దొంగత నానికి ప్రయత్నించారు. బ్రాందీ షాపుకు వేసిన తాళాలు రాకపోవడంతో దొంగలకు షాపులోని బ్రాందీ సీసాలు దొరకలేదు. బ్రాందీ షాపులో దొంగతనం ఎలాగూ చేయలేకపోయే సరికి పక్కనే ఉన్న కూల్ డ్రింక్ షాపు తాళం పగలగొట్టి అందులోకి ప్రవేశించి అందులో ఉన్న నగదు కొన్ని వస్తువులను తీసుకెళ్లారు. సోమవారం ఉదయం కూల్ డ్రింక్ షాపు యజమాని వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. కూల్ డ్రింక్ షాపు యజమాని రవి ఇచ్చిన సమాచారం మేరకు షాపులో రూ.20వేలు నగదు అలాగే సిగరెట్లు, కూల్ డ్రింక్స్, రాజా ఖైనీ ప్యాకెట్లు, హ్యాండ్స్ ప్యాకెట్లు అన్ని కలిపి ఒక రూ.10వేలు సరుకులు తీసుకెళ్లినట్లు కూల్ డ్రింక్ షాపు యజమాని రవి తెలిపారు.

## మాలేపాటి కుటుంబం పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుంది



**దగదర్తి, ఆగష్టు 4, ప్రభాతవార్త :** దగదర్తి మండలం దుండిగం గ్రామ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ప్రజలకు గృహ నిర్మాణ అవసరాలకు గాను రూ.4.75 లక్షల పై చిలుకు మొత్తాన్ని మాలేపాటి రామానాయుడు చారిటబుల్ ట్రస్టు తరుపున అందించడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి భానుచందర్ వారి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలేపాటి వంశం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఈ కారణంగానే దగదర్తి మండల ప్రజలు తమను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ అభిమానిస్తారని వ్యాఖ్యానించారు. ఇంకా గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, రేకులు అడిగిన పేదలకు తప్పక పంపిణీ చేస్తామని, ఏ అవసరం వచ్చినా అందరికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పేపర్ల సూరిబాబు, వర్థినేని కృష్ణ, బత్తల ఏడుకొండలు, తాటిచెట్ల వెంకటేశ్వర్లు, మొలతాటి పవన్, దుండిగం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు కోనంకి శివయ్య, రాంబాబు, పెంచలమ్మ, చెన్నూరు పంచాయతీ నుండి రమణమ్మ, అంకబాబు, మన్నూరు రమణయ్య, శ్రీనివాసులు, కొత్త వెంకటరావు, తురిమెర్ల పంచాయతీ నుండి హరి, బ్రమ్మ, మారెళ్ళపాడు గ్రామ టీడీపీ నాయకులు కృష్ణ, రంగ సముద్రం, నాయకులు మణి, ప్రభాకర్, కేశవులు, లింగాలపాడు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, అత్యధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లోని ఆధార్ కేంద్రంలో అంగవైఫల్యం మహిళకు ఆధార్ కార్డు నమోదు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 4, ప్రభాతవార్త :** కలెక్టర్ కార్యాలయంలోని ఐటీ డీఏ గిరిజన ఆధార్ కేంద్రంలో సోమవారం అంగవైకల్యంతో ప్రభుత్వ పథకాలు ఏది కూడా నోచుకోని మనుబోలుకు చెందిన నాగలూరు పెంచిలమ్మ ఎస్ టీ యానాదికి చాందిన మహిళకు ఎక్కడ కూడా ఆధార్ తీయకపోవడంతో చివరకు కలెక్టర్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రానికి వచ్చిన నాగులూరు పెంచలమ్మకు నూతన ఆధార్ కార్డు నమోదు చేయడం జరిగిందని, ఆధార్ కార్డు నమోదు కేంద్రం ఆపరేటర్ సల్మాన్ తెలిపారు.

## నిరుపేద వ్యక్తికి మాలేపాటి మోటార్ అందజేత



**దగదర్తి, ఆగష్టు 4, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామ వాస్తవ్యులు బైక్ మెకానిక్ షాపు నడుపుతున్నటువంటి షేక్ హజరత్ అతని షాపులో పని చేయుటకు మోటార్ అవసరమైన నేపథ్యంలో దగదర్తి మండల తెలుగు దేశం పార్టీ నాయకులు మాలేపాటి రవీంద్ర నాయుడు కుమారుడు మాలేపాటి భానుచందర్ దాతృ త్వంతో రూ.60వేలు ఖర్చుతో నూతన మోటారును ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాలేపాటి సుధాకర్ వారికి మోటార్‌ను అందించారు. హజరత్‌కు మోటార్ ఇచ్చి ఆదుకున్నందుకు గాను వారి కుటుంబ సభ్యులు ఎంతగానో సంతోషించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు వట్టిగుంట గోపాల్, వర్తినేని కృష్ణ, చావ వెంకటేశ్వర్లు, బత్తుల ఏడుకొండలు, మన్నూరు సుబ్బయ్య, షేక్ బషీర్, షేక్ చినీషా, తాటిచెట్ల వెంకటేశ్వర్లు, మొలతాటి పవన్, యాకశిరి వెంకయ్య, కామినేని మనోహర్, యామల శ్రీను, యామల కుప్పుస్వామి, షేక్ మీరయ్య, షేక్ సుభాన్ తదితరులు ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోండి

**కావలి రూరల్, ఆగష్టు 4 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించు ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025 జాతీయ పురస్కారాలను సెప్టెంబరు 14వ తేది విశాఖపట్నంలో అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్, బట్టు శ్రీనివాసరావులు తెలియజేశారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ స్వచ్ఛంద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో కృషి చేసినవారు జాతీయ నవస్ఫూర్తి, నవకీర్తి, మహానంది,స్వర్ణనంది,స్వర్ణ కంకణం, కామధేనువు, మయూరి, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, లెజండరీ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్చకత్వం, జర్నలిజం, సామాజిక, రంజువాయుధ్యం, సాహిత్యం,రచన, కవులు,కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం,కూచిపూడి, చిత్రలేఖనం, శిల్పం, నాటకం,జానపదం,మిమిక్రి,అవధానం,విద్య,వైద్యం,ఇంద్రజాలం,ముఖాభినయం,హరికథ,బుర్రకథ, ఒగ్గుకథ, రంగస్థల కళాకారులు,జ్యోతిష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, వాస్తు, యోగ,డోలక్ హార్మో ని యం, భజన కళ సామాజిక, క్రీడలు, షాట్‌ఫిలిం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ అభివృద్ధి, గ్రామస్థాయి ప్రజా ప్రతిని ధులు, వివిధ రంగాలలో పనిచేస్తున్న వారు ఈ పురస్కారాలకు సెప్టెంబరు 5వ తేది లోగా దరఖా స్తులు చేసుకోవాలని తెలిపారు.కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్‌కు మహానంది ఇవ్వడంజరుగు తుందని తెలిపారు.మరిన్ని వివరాలకు 9985275385,7382592852 సెల్ నెంబర్లలో సంప్రది ంచాలని కోరారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**– చౌక దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ సవ్యంగా సాగుతోంది – నెల్లూరు అర్బన్ తహశీల్దార్ షఫీ మాలిక్**



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 4, ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని నెల్లూరు అర్బన్ తహశీల్దార్ షఫీ మాలిక్ తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా షఫీ మాలిక్ మాట్లాడుతూ సచివాలయాల్లో నమోదు చేసుకోవాల్సిన కుల ధృవీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ల కోసం ప్రజలు తమను సంప్రదిస్తున్నారని, అలాంటి వారు నేరుగా వారి పరిధిలో ఉన్న సచివాలయాలలో సర్టిఫికేట్ల కోసం నమోదు చేసుకుంటే పరిష్కారం అవుతుందన్నారు. గతంలో కుల ధృవీకరణ పత్రం కోసం నెల రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం 15 రోజుల్లోనే కుల ధృవీకరణ పత్రాలు అందిస్తున్నామని చెప్పారు. నేటివిటీ, ఇన్కమ్ సర్టిఫికేట్లు కూడా ఒకటి రెండు రోజుల్లోనే అవసరమైన వారికి అందిస్తున్నామని వెల్లడించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ల మంజూరులో కొంత జాప్యం ఉంటుందని, అన్ని డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందన్నారు. ఓబీసీ, ఓసీ సర్టిఫికేట్ల మంజూరులో వీఆర్వోలు పరిశీలించిన తరువాతే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ల మంజూరుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. బీసీఈ, బొందిలి, ఓబీసీ సర్టిఫికేట్లను వీఆర్వోలు ధృవీకరించిన తర్వాతనే తాము పరిశీలించి ఒక వారం రోజుల్లో అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆయా సర్టిఫికేట్ల మంజూరులో సంయమనం పాటించాలని కోరారు. అత్యవసరమైన సర్టిఫికేట్ల కోసం తమను సంప్రదిస్తే అందుకోసం వెంటనే పరిశీలించి అందిస్తామని వెల్లడించారు. అర్బన్ ప్రాంతంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు అన్ని సరుకులు సకాలంలో అందుతున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రజలకు ప్రభుత్వం అందించిన అన్ని సరుకులను సకాలంలో అందించాలని కోరారు.

## ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**నెల్లూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త –వైద్యం :** నెల్లూరు పట్టణంలోని లక్ష్మీ నరసింహారెడ్డి టౌన్ హాల్ నందు ఆదివారం ఎమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించడం జరిగిందని ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎన్ జయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సూపర్‌వైజర్ ఏఎన్ఎం సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడుతామని తెలియజేశారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. అలాగే గత ఐదు సంవత్సరాలుగా ఆర్‌సీహెచ్ ఇన్సెంటు రాలేదన్నారు. అదే విధంగా 2211, హెడ్ వాళ్లకు ఐదు సంవత్సరాలుగా ఎఫ్‌టీఏ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దానితో పాటు సరెండు లీవ్ రావడం లేదని, మూడు సంవత్సరాల నుండి జీపీఎఫ్ లోన్లు రావడం లేదన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర స్థాయిలో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా టి.సౌందర్య, ఉపాధ్యక్షులుగా ఏ.అనిత, పి.విజయ, పి.రమణమ్మ, జి.రియాన, వి.ఉమామహేశ్వరి, సెక్రటరీగా వి.హైమావతి, జాయింట్ సెక్రటరీగా జేఎస్‌జే నిర్మల, జే.జయశీల, జే.పద్మ, కేవీ రమణ, ఏఎం విజయపద్మ, అసోసియేషన్ అధ్యక్షులుగా ఉమామహేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వంలక్ష్మీ, అలాగే తిరుపతి జిల్లా అధ్యక్షులుగా కంభం సుగుణ, అసోసియేషన్ ప్రెసిడెట్ గా ఏ.జ్యోతిర్మయి, ఉపాధ్యక్షులుగా జి.సంపూర్ణ, ఏ.శిరీష, పి.వెంకటరత్నం, బి.శాంతి, బి.ఉష, పి.పవిత్ర, జనరల్ సెక్రటరీలుగా ఆర్‌కే మంజుల, జి.ప్రశాంతి, ఎం.మంజుల, జే.అనురాధ, జే.మమత, జే.లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రభుత్వ వాహన డ్రైవర్లకు సభ్యత్వమిచ్చి ఎన్నికలు నిర్వహించండి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్ట్ 4, ప్రభాతవార్త :** ప్రభుత్వ వాహన డ్రైవర్లకు సభ్యత్వమిచ్చి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డ్రైవర్ల సంఘం నాయకుడు ప్రసాద్ తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినములో కలెక్టర్ ఓ ఆనంద్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయం యందు ప్రభుత్వ వాహనములకు డ్రైవర్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయుచున్నాము. డ్రైవర్ల సంఘం అధ్యక్షులు చిరంజీవి తేదీ: 30.06.2025న పదవి విరమణ చేసినారు. ఆ స్థానములో తాత్కాలిక అధ్యక్షులుగా నియమించబడి ఉన్నారు. గత పదిహేను ఏళ్ల నుండి ఎన్నికలు నిర్వహించకుండా నిరంకుశత్వముగా ప్రభుత్వ డ్రైవర్లుగా కనీసము సభ్యత్వము కూడా ఇవ్వకుండా చేసియున్నారు. చిరంజీవి అనుచరుని ప్రస్తుతము ఎన్నికలు జరుపకుండా తాత్కాలిక అధ్యక్షులుగా నియమించియున్నారు. అందరు ప్రభుత్వ డ్రైవర్లకు సభ్యత్వము నగదు వసూలు చేసి సభ్యత్వము ఇచ్చి ఓటర్ల జాబితా తయారు చేసి ప్రచురణ జరిపి నిర్ణీత సమయంలో ఎన్నికలు నిర్వహింప చేయుటకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినచో నిష్పక్షపాతముగా ఎన్నికలు జరగగలవని పలువులు డ్రైవర్లు తెలుపుతున్నారన్నారు ఎన్నికలు నిర్వహణ కొరకు ప్రత్యేక అధికారిని నియమించవలసినదిగా కోరుచున్నాము. ప్రభుత్వము సహాయము ద్వారా పొందిన "రాజు కాంప్లెక్స్" నిధులు దుర్వినియోగము కాకుండా కాపాడవలసి ఉన్నందున ప్రత్యేక అధికారి నియమించి న్యాయం చేయవలసినదిగా ఆయన కోరారు. సంఘ బైలా పరిశీలనార్థము కలెక్టర్‌కు అందజేశామని ఆయన తెలిపారు.

## జయభారతి హాస్పిటల్ రవిచిన్న పిల్లల హాస్పిటల్‌ను సందర్శించిన జిల్లా అధికారి ఖాదర్ వల్లి



**నెల్లూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త –వైద్యం :** నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వల్లి నెల్లూరు నగరంలో ఉన్నటువంటి జయ భారతి భాస్పిటల్ రవి చిన్న పిల్లల హాస్పిటల్ ని సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా డాక్టర్ ఖాదర్ వల్లి మాట్లాడుతూ స్కాన్ చేసిన ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ వివరాలు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన అన్ని రికార్డ్‌న్స ను వెరిఫై చేయడం జరిగింది. అంతే కాకుండా అన్ని ప్రైవేటు హాస్పిటల్స్‌లో టీబీ అనుమానితులు ఎవ రైనా వస్తే వాళ్లని దగ్గరలో ఉన్న గళ్ళ పరీక్షా కేంద్రానికి పంపించాలని, ఒక వేళ గళ్ళ పరీక్షలో టబీ అని నిర్ధారణ అయితే ఆ టీబీ పేషెంట్‌కి ఆరు నెలల పాటు టీబీ మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, పబ్లిక్ ప్రైవేటు మిక్స్ కోఆర్డినేటర్ హరీష్, డిస్టిక్ కోఆర్డినేటర్ భవ్య తులసిరామ్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రవీణ, సరిత పాల్గొన్నారు.

## పాత పోన్లు ఇప్పటి యాప్‌లకు అనుకూలించడం లేదు అంగన్‌వాడీకార్యకర్తల నిరసన



**మనుబోలు ఆగష్టు 4 ప్రభాతవార్త :** అంగన్‌వాడీలకు కనీసం వేతనం ఇవ్వాలని వెంకటాచలం పిడి కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనకు దిగారు. ఈ సందర్భం గా వారు మీడియాతో మాట్లాడుతు తెలంగాణా ప్రభుత్వంలా కనీస వేతనం అంగన్ వాడీలకు 26 వేలు ఇవ్వాలని లేదంటే 18 వేలు అయినా ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 2022 సంవత్సరంలో ఇచ్చిన స్మార్ట్‌పోన్లుఇప్పుడున్న పని ఒత్తిడికి యాప్‌లకు సపోర్టు చేయడం లేదని వివరించారు. లబ్ధిదారులు పోటోలు తీయాలన్న ఇన్ అవుట్ చేయాలన్న పోన్లు పనిచేయడం లేదని తెలిపారు. జిల్లాలోని 12 ప్రాజక్టులకు సంబందించి పోన్లు తిరిగి ఇవ్వడం జరుగుతుందని పేర్కున్నారు. గత ఆరు నెలలుగా కొత్త పోన్లు ఇస్తామని ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. కొత్త పోన్లు ఇచ్చే వరకు రికార్డు పనులను మాత్రమే చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నిర్ణయానికి కట్టుబడి ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనకు దిగినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి రెహానాబేగం, మండల కార్యదర్శి అద్యక్షురాలు సుగుణమ్మ, లక్ష్మీకాంతమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, మండల కార్యదర్శి ఇరగాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శుభదిన్ భోజన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ



**ఉదయగిరి, ఆగష్టు 4, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుర్గం పల్లి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధి కారి విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్యా లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాల వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నాయని ఉపా ధ్యాయులను అభినందించారు. తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పరిశీలిస్తూ శుభ్ దిన్ భోజన్లో భాగంగా వై.శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు స్వీట్స్, కూల్ డ్రింక్స్, కేక్స్, ఫ్రూట్స్ అందజేసి వారి మిత్రుడు బుద్ద బాయి అభిదాలిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు షేక్ హజరత్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్‌టీ హుసేని పాల్గొన్నారు.

## విశ్రాంత పోస్టుమాస్టర్ ఇంట్లో భారీ చోరీ



**కావలిరూరల్, ఆగష్టు4, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం ఆనెమడుగు పంచాయతి మొండిదిన్నెపాళెం గ్రామంలో గత 47సంవత్సరాలుగ ఉంటున్న విశ్రాంత పోస్ట్ మాస్టర్ ద్రోణాదుల సుబ్రమణ్యం ఇంట్లో ఆది వారం రాత్రి బారీ చోరీ జరిగింది. భాదితుడు ద్రోణాదుల సుబ్రమణ్యం తెలిపిన వివరాలమేరకు ఈనెల 1వ తేదీ శుక్రవారం రాత్రి తన బందువులకు అనారోగ్యంగ వుండడంవల్ల తన భార్యతో కలసి హైదరాబాదుకు వెళ్ళామని చెప్పారు. కావలిలో నివాసముంటున్న తన కుమారుడు గిరి శనివారం మొండిదిన్నెపాళెంలోని తన నివాసానికి వెళ్ళి పూలమొక్కలకు నీరుపోసి కావలికివెళ్ళారని తెలిపాడు. మరలా ఆదివారంకూడ కుమారుడు తిరిగి గ్రామంలోని తన ఇంటికి వచ్చాడని అనంతరం పరిశీలించగ గుర్తుతెలియని దుండగులు ఇంటి మైన్ డోర్‌కు వున్న గ్రిల్స్‌ను విరగగొట్టి తాళంవేసివున్న చిలుకును ఊడదీసి వుండడాన్ని గమనించాడని చెప్పాడు. ఇంట్లోకి వెళ్ళి పరిశీలించగ రెండు బీరువాల తాళాలు పగులగొట్టి బీరువాలో వున్న చీరలు ఇతర వస్తువులు చెల్లాచెదురుగ పడవేసి వుండడాన్ని గుర్తించాడు. బీరువాలోవున్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, కెజినుండి ఒకటిన్నర కెజి వరకు వెండి వస్తువులను, 30వేల విలువకలిగిన ఐదు రూపాయల నాణేలను 11వేల రూపాయల నగదును దొంగిలించబడినట్లు తెలిపారు. దొంగిలించబడిన మొత్తం విలువ దాదాపు 23లక్షల వరకు వుంటుందని వాపోయాడు. సోమవారం గ్రామానికి వచ్చి పరిశీలించుకుని కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐలు బాజిబాబు, కృష్ణయ్యలు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్‌కూడ పరిశీలించి వివరాలు నమోదు చేసుకు న్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐలు తెలిపారు.

## దాతృత్వం చాటుకున్న కందికట్టు నారాయణ



**కావలిరూరల్, ఆగష్టు4, ప్రభాతవార్త:** కావలి పట్టణ నివాసులు కీర్తిశేషులు కందికట్టు శంకరయ్య 17వ వర్ధంతి సందర్భంగ వారి కుమారుడు కోడలు సీనియర్ పాత్రికేయుడు కందికట్టు నారాయణ శ్యామల దంపతులు సోమవారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ద్వార కావలి తుఫాన్ నగర్, జంగాల కాలనీలోని నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు వితరణగ అందజేశారు. ఈసందర్బంగ గంగపట్న సురేంద్ర మాట్లా డారు సీనయర్ పాత్రికేయుడు కందికట్టు నారాయణ గత కొన్నేళ్ళుగ తమ సంస్థ ద్వార పేదలకు సేవల నదిస్తు మానవత్వం చాటుకుంటున్నారని తెలిపారు. అందులో భాగంగ వారి తండ్రి శంకరయ్య జ్ఞాపకార్థంగ పేదలకు భోజనం వితరణ చేయడం సంతోషదాయకమని అన్నారు. ఈసందర్బంగ దాత నారా యణకు ధన్యవాదాలు తెలిపాడు. శంకరయ్య పవిత్రాత్మకు శాంతిచేకూరాలని భగవంతుడ్ని ప్రార్ధించామని తెలియ జేశారు.

## ప్రభుత్వ భవనాల పరిశీలన



**కోవూరు, ఆగష్టు4 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలు, ఆస్పత్రులకు సంబ ంధించి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ ఏఈ చంద్ర శేఖర్ కోవూరు మండ లంలోని సాంఘిక సంక్షేమ , బీసీ బాల బాలికల వసతి గృహ సముదాయాలను , అదేవిధంగా పాటూరు , పడుగుపాడు ఉన్నత పాఠశాలల భవనాలను సోమవారం నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సంద ర్భంగా నివేదికను తయారు చేసి జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందన్నారు.

## భూగర్భంలో గ్యాస్ నిక్షేపాలకోసం మిషన్ అన్వేషణ



**కావలి రూరల్, ఆగష్టు 4, ప్రభాతవార్త :** కావలి తీరప్రాంతంలో ఓఎన్‌జిసి వారు పెట్రోల్,గ్యాస్ నిక్షేపాలకోసం సర్వే చేపట్టారు. ఈ మేరకు త్రవ్వకాలు చేస్తున్న అద్వాంట్ కంపిని ప్రతినిదుల సోమవారంకావలి రెవిన్యూడి విజినల్ అదికారి మరి యు సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ ఎం సన్నీవంశీకృష్ణను కలసివి వరాలు తెలియ జేశారు .భూగర్భంలో పెట్రోలు,డీజల్,గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయన్న ఉద్దేశ్యంతో ఓఎన్‌జిసి ఆదేశాల మేరకు జిల్లాలోని సముద్రతీర మండలాలలో మిషన్ అన్వేషణ పేరుతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. కావలి,అల్లూరు,దగదర్తి,బోగోలు, దవలూరు, కొడవలూరు జలదంకి, కలిగిరి, వింజ మూరు, దుత్త లూరు తదితర మండలాలలో ఆయిల్ నిక్షేపాలు వున్నాయని ఓఎన్‌జిసి అదికా రులు వారి సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు కనుక గ్రామస్తులు రైతులు ప్రతి ఒక్కరు ఈయొక్క సర్వేకి మండల తహసి ల్దార్ లందరు సహకరించాలని ఆర్‌డిఓ వంశీకృష్ణ తెలిపారని అద్వెంట్ కంపిని పిఆర్ఓ దూడల సుదీర్ తెలిపాడు.

## ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు పై టిడిపి నేతల హర్షం



**బుచ్చి ఆగస్టు 4 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని 17 వవార్డులో గుంటూరు వారి వీధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయ డం పట్ల పద్మశాలి కార్పోరేషన్ రాష్ట్ర డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాళ్ళ స్వా మి మాట్లాడుతు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రచారంలో వచ్చినప్పుడు 17 వవా ర్డులో విద్యుత్ సరఫరాలో ఇబ్బందు తెలియజే యడంతో స్పందించారని, ప్రభుత్వం రాగానే సమస్యను పరిష్కరిస్తానని హామి ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు .. ప్రస్తుతం ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు వారు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదు స్వీకరించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి ఆగస్టు 4 ప్రభాతవార్త** గ్రీవెన్స్‌డే పురస్క రించుకొని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ కార్యా లయంలో చైర్‌పర్స న్ మోర్లసుప్రజామోర్ల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పెన్షన్ కావాలని అందరు తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభం విరిగి పోయిందని కొందరు వివిధ సమస్యలతో అర్జీలు సమ ర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్స న్ మాట్లాడుతు తనదృ ష్టికి సమస్య వచ్చిన వెంటనే అధికారులను పురమాయించి వీలైనంత త్వరగా పరిష్కారం చేసేందుకు కృషిచేస్తానని అన్నా రు. గ్రీవెన్స్‌డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పట్టణంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవా లని తన వల్ల కాని పక్షంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు.

## మయూరి సంగీత నృత్య కళాక్షేత్రం ప్రారంభించిన శ్రీధర్



**బుచ్చి ఆగస్టు 4 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీ నగర్‌లో సుజన అపార్ట్‌మెంట్ ఎదురుగా సాయి బాబాగుడి సమీపంలో మయూరి సంగీనృత్య కళాక్షేత్రాన్ని అపస్మా జిల్లా నాయకులు, సమరసతా సేవా పౌండేషన్ సభ్యులు నేలనూతల శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధ౯ర్ మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాలలో నాట్యకళ విస్తరణకు కృషి చేస్తు మయూరిడాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ ప్రా రంభించడం అభినందనీయమని నాట్యాచార్యులు (డాన్స్ మాష్టర్ ) ఎం.శివశంకర్‌ని ఆయన అభినందిం చా రు. బుచ్చిరెడ్డి పాళెంలో నృత్య కళాశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. పాశ్చాత్య పోక డలతో మన సంస్కృతి మరుగున పడిపోనివ్వకుండా పిల్లలకు భరతనాట్యం,కూడిపూడి, వంటివి ప్రతి తల్లి దండ్రులు తమ బిడ్డలకు నేర్పించాలని,మయూరి డాన్స్ అకాడమిని ప్రోత్సహించాలని ఆయన కోరా రు.ఈకార్యక్రమంలో పలు వరు కళాకారులు పాల్గొన్నారు.

## ఆగని చికెన్‌వేస్ట్ దందా



**కోవూరు, ఆగస్టు4 ప్రభాతవార్త :** ఒకవైపు పోలీసులు ఎన్ని కట్టుదిట్టాలు చేస్తున్నా చెన్నై, బెంగుళూరు నుంచి చికెన్ వేస్ట్ అక్రమ రవాణా నిరాటంకంగానే కొనసాగుతుంది. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున చెన్నై వైపు నుంచి వస్తున్న చికెన్ వేస్ట్ వాహనాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రషీద్ ఆపి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ చికెన్ వేస్ట్‌ను పెన్నా నది పరివాహక ప్రాంతంలో గుంటతీసి అందులో పూడ్చేలా చర్యలు తీసుకు న్నారు. ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణా చేస్తున్న కె. శీనయ్య, పి. శివయ్య, కె. నితి న్‌లను అదుపులోకి తీసుకుని కేసైఉ నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ కోవూరు మండలంలో ఏ ప్రాంతంలో కూడా చికెన్ వేస్ట్ అక్రమ రవాణా సహిం చేది లేదన్నారు. ఇప్పటికే ఈ రవాణా చేస్తున్న వారికి పలుమార్లు చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. ఎక్కడైనా అక్రమంగా చికెన్ వేస్ట్ వాహనాలు వస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## కళాశాలలో గుడ్ టచ్,బ్యాడ్‌టచ్‌పై అవగాహన




**చేజర్ల ఆగస్టు 4 ప్రభాతవార్త** చేజర్ల ప్రభు త్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యా ర్థులకు గుడ్‌ట చ్,బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. సంగం సిఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో కళాశాల విద్యా ర్థులకు గుడ్‌ట చ్,బ్యాడ్ టచ్‌పైన అవగాహన కల్పిం చారు. కళాశాలలో విద్యార్థులు చదువుపై దృష్టి సారిం చాలని అన్నా రు. ఈ వయస్సులో ఆకర్షణకు గురైతేజీవితంలో విద్యార్థులు నష్టం వాటిల్లితుందని తెలియ జేశారు. చట్టా లపైన అవగాహన కలిగి ఉండాలని మహిళలకు అన్యాయం జరిగితే టోల్ ఫ్రీనెంబర్ 112కి ఫోన్ చేయాలని ఇవ్వాలని తెలిపారు. ఒక లక్ష్యంతో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని సూచించారు. విద్యా ర్థులకు పలు సూచనలు,సలహాలు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ కె పోలమ్మ, అద్యాపకుల బృందం పాల్గొన్నారు.

## 13న బిజెపి రాష్ట్ర అద్యక్షులు రాకను విజయవంతం చేయండి



**సంగం అగష్టు 4 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని స్దానిక ఇరిగేషన్ బంగ్లాలలో సంగం ,చేజర్ల,ఏఎస్‌పేట మండలాల బిజెపి నాయకులతో బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల క్రిష్ణయ్య సమావేశం నిర్వహించారు. మూడు మండలాలలో పార్టీ బలోపేతంపై నాయకులతో ఆయన చర్చిం చారు. ఈ సంద ర్భంగా బత్తల క్రిష్ణయ్య మాట్లాడుతు 13న బిజెపి రాష్ట్ర అద్యక్షులు పి వి ఎన్ యాదవ్ నెల్లూరు పర్యట నకు వస్తున్నారని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాబోయే రోజులలో కార్యకర్త సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈమూడు మం డలాలలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని, సమస్యలు ఉన్నతస్దాయికి తీసుకొని వెళతామని ఆయన పేర్కున్నారు. క్షేత్రసాయి నుండి పార్టీ ని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లో ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమపథకాలు ప్రజల దృష్టికి తీసుకొని వెళ్ళాలని ఆయన నా యకులకు కార్యకర్తలకు సూచించారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అద్యక్షులు మనోహా ర్‌రెడ్డి, అంజయ్య,చెంచులరెడ్డి, నరసారెడ్డి బిజెపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సిటిజన్ ఫీడ్ బ్యాక్ తప్పనిసరి

### - జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ అధికారులకు సూచన




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్‌అర్జీలు, ఇళ్లనిర్మాణాల పురో గతి, ఉపాధిహామీ పనులు, పి4 పథ కం పురోగతి మొదలైన అంశాలపై సబ్ కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిష నర్లు,ఎంపిడివోలు, తహశీల్దార్లు, ఆయాశాఖల అధి కారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మా ట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మానికి ప్రజల అందిస్తున్న అర్జీలకు నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని సూచించారు. అర్జీలపై ఆయా సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని సిటిజెన్ ఫీడ్బ్యాక్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించి సచివాల యాల సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న పి4 కార్యక్రమంలో మార్గదర్శిలు, బంగారు కుటుంబాల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇందుకూరుపేట మండలం 1260 బంగారు కుటుంబాలను, 261 మార్గదర్శిలను ఎంపిక చేసి మొదటి స్థానంలో ఉందని, ఇదే విధంగా అన్ని నియోజకవర్గాల్లో పి4 కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి వుంద౯న్నారు. హౌసింగ్‌లో ఉపాధిహామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పిం చాలన్నారు. ఎపివో లు ఉపాధిహామీ పనిదినాలను పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సంద ర్భంగా జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫ రెన్సులో డి ఆర్ ఓ హుస్సేన్ సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్ రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణు గోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్ఈ విజయన్, సమగ్ర శిక్ష ఏపీసి వెం కటసుబ్బయ్య, నెల్లూరు ఆర్డీవో అనూష తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు ఇంటి గృహప్రవేశానికి నాయకులు వెలువ



**కొడవలూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మంచి మనసున్న వ్యక్తి ప్రజల కోసం అన్ని విధాలుగా పనిచేసే నాయకుడు యుగంధర్ సింగ్ కొడవలూరు మండలం పాత వంగల్లు గ్రామంలో పుట్టా రు ఆయన రాజకీయంగా ఎన్నడు లేదు అయితే రాజకీయంలో మం చి మనసున్న మహిళా ఎమ్మెల్యే రావడం ఎంతో సంతోషకరమైన విషయము అయితే వారు చేసే సేవ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి ఎమ్మెల్యే అడుగుజాడలు నడుద్దామని ఆలోచనతో ఉన్నామని ఆయన తెలియజేశారు. కోవూరు నియోజక వర్గంలో వేమరెడ్డి దంపతులు చేసే సేవా కార్యక్రమాలను అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి వచ్చే సేవా కార్యక్ర౯మాల్లో అందించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. మండలం నుండి యుగంధర్ సింగ్ అభిమానులు ఆయన ఇంటి గృహప్రవేశానికి వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## లింగనిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు



**ఉదయగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజ కవర్గ పరిధిలో ప్రైవేటు హాస్పిటల్ నందు పీసీపీఎన్‌డీ యాక్ట్ కింద కమి టీ పర్యవేక్షణలో లింగ నిర్ధారణకు సంబంధించి పీసీపీఎన్‌డీటీ సబ్ డివిజనల్ టీం అధికారులు వైద్యులు డాక్టర్ ఠాగూర్, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య ఉదయగిరిలోని శ్రీ విద్య, డాక్టర్ శ్యాంప్రసాద్ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్కానింగ్ వివరాలను, ఫారం ఎఫ్ రిపోర్టులను, స్కారింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, పీసీపీఎన్‌డీటీ డిస్ప్లే బోర్డులను పరిశీలించారు. గర్భవతులకు స్కానింగ్ సమయంలో ఎటువంటి పరిస్థితుల్లో కూడా లింగ నిర్ధారణ చేయకూడదని ఆ విధంగా చేసిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేశారు.

## పోలీస్ విచారణకు హాజరైన మాజీ మంత్రి అనిల్

### - 6 గంటల పాటు కొనసాగిన విచారణ తెలిసినంతవరకు సహకరించా - అనిల్ కుమార్



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై అభ్యం తరకర వ్యాఖ్యలు చేసిన కేసులో ఏ2గా ఉన్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ సోమవారం నెల్లూ రు రూరల్ డిఎస్పి కార్యాలయంలో పోలీస్ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు అడిగిన 36 ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకున్న అనిల్ కుమార్ తిరిగి సాయంత్రం సుమా రు 4 గంటల సమయానికి బయటకు రావడం గమనార్హం. దాదాపు 6 గంటల పాటు పోలీసులు ఆయనను విచారించారు.
ఖ తెలిసిన వరకు సమాధానాలు ఇచ్చి సహకరించాఖ తనకు తెలిసి నంతవరకు పోలీసుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చి సహకరించినట్లు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పోలీస్ విచారణ అనంతరం వెలుపలికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు ఇచ్చిన ప్రశ్నలకు అరగంటలోపే రాతపూర్వకంగా సమాధానం ఇచ్చానని, అయినా పలు రకాల ప్రశ్నలతో తనను 6 గంటలపాటు విచారించారని అన్నారు. కోవూరు లో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, ప్రస్తుత కోవూరు ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యలకు తనకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. ఆ కార్యక్రమంలో వేదికపై ఉన్నంత మాత్రాన తనను ముద్దాయిగా పేర్కొంటూ రెండు రోజుల తర్వాత కేసులో పేరు నమోదు చేశారని గుర్తు చేశారు. తనతో పాటు సమావేశంలో వెయ్యి మం దికి పైగా కార్యకర్తలు ఉన్నారని, ఇలా కేసులు పెట్టుకుంటూ పోతే అందరి పైన కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. తనను కేవలం ఈ సంఘటన సంబంధించిన ప్రశ్నలు మాత్రమే అడిగారని, ఇతర విషయాలు ఏది అడగలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన పేర్కొన్నారు. అంత క్రితం అనిల్ కుమార్ విచారణకు హాజరయ్యే సమయంలో ఆయన వెంట నెల్లూరు నగరం, కోవూరు ప్రాంతాలకు చెందిన పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు అనిల్ కుమార్‌ను, ఆయన న్యాయవాదిని మాత్రమే లోనికి అనుమతించారు.

## త్వరితగతిన అర్జీలను పరిష్కరించండి : డిప్యూటీ కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమి షనర్ చెన్నుడు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజ ల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా అందుకున్న అర్జీలు అకౌంట్ సెక్షన్ 1, ఆప్కాస్ 3, ఇంజనీరింగ్ 6, టిడ్కో హౌసింగ్ 18, రెవెన్యూ 4, టౌన్ ప్లానింగ్ 8, పబ్లిక్ హెల్త్ 5, హెచ్ సెక్షన్ 2, పెన్షన్ 1, మొత్తం 48 అర్జీలను డిప్యూటీ కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. నిర్దేశించిన సమయంలోపు సమస్యలన్నిటిని పరిష్కరించాలని విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోస్టర్ అడాప్షన్ - కలిసొచ్చే కాలానికి, నడిసొచ్చే పిల్లలు

### - జిల్లా కలెక్టర్ ఆనంద్‌చే పోస్టర్ ఆవిష్కరణ




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** ఫోస్టర్ అడాప్షన్ - కలిసొచ్చే కాలానికి, నడిసొచ్చే పిల్ల లు ఈ పథకం ద్వారా 6 నెలల పై బడిన 18 సంవత్సరాల లోపు పిల్లలను 2 సంవత్సరాల పాటు పెంచి, తత్ఫలితంగా శాశ్వతంగా దత్తత పొందే అవకాశం కల్పించబడు తుం ది. ఈ కార్యక్రమంలో లో ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఎంహెచ్వో సుజాత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ సుధీర్ కుమార్, డిసిపిఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 4, ప్రభాతవార్త** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం తిక్క న ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కలెక్టర్ ఆనంద్ కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక భీమా సదుపాయం ఆరోగ్య భీమా వృద్ధాశ్రమ ఏర్పాటు అక్రిడేషన్ కమిటీలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బిజెఏసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని రాయితీపై ఏపీ ప్రయాణం మీడియా అకా డమీకి గవర్నమెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని అవార్డులు అందించాలని మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని పెన్షన్ సౌకర్యం కల్పించాలని మాసపత్రిక ప్రచురణ పునరుద్ధరించాలని సమాచార శాఖ బలోపేతం అక్రిడిటేషన్ జారీ చేయాలని తదితర సమస్యలను తీర్థ తీర్చాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## పీరయ్య గుండెపోటుతో కుప్పకూలిన ఘటన

### స్పందించిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని



**వరికుంటపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త** మైనింగ్ వద్దు గ్రా మమే ముద్దు అనే నినాదంతో ప్రజల పక్షాన పోరాడుతున్న తెలుగుదేశం నాయకుడు పీరయ్య గుండెపోటుతో పోలీస్ స్టేష న్‌లో కుప్పకూలినవిషయంపై టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు స్పందించాడు .భా రత ప్రజా స్వామ్యంలో ప్రజల గొంతును వినడం అవసరమని ప్రజాభిప్రాయాన్ని తెలియజేసే నాయకులను అనౌసరంగ ఇబ్బందులకు గురిచేయడం భాదాకరమ న్నారు.పోలీస్ వ్యవస్థ భాద్యతగ వ్యవహరించాలని నేతలకే దిక్కులేకపోతే సామా న్యుల పరిస్తితేమిటని ఆగ్రహం వ్యక్తంచేశాడుపీరయ్య ఆరోగ్య స్థితిపై ఆయ న ఆరా తీశారు. ఆయనకు వైద్య సదుపాయాలు కల్పించేల చూస్తామని ప్రభు త్వం తరపున న్యాయం జరిగేల చూస్తా మన్నారు.ఆయన త్వరగ కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**నెల్లూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త** 33/11కేవీ ఎంజీనగర్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ డీకేడబ్ల్యూ ఫీడర్ నందు విద్యుత్ లైన్ మార్చడం, కొత్త ట్రాన్స్‌పార్మర్స్ ఏరెక్షన్ కారణంగా నీలగిరి సంగం, బట్వాడి పాలెం సెంటర్, ఎస్పీ ఆఫీస్ న్యూ, పోలీసు పెట్రోల్ బంకు, కేవీఆర్ పెట్రోల్ బంకు, కస్తూర్బ కళాక్షేత్రం పరిసర ప్రాంతా లలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగు తుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో కరేడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు అరెస్టు

### కరేడు ఉద్యమాన్ని అణిచేందుకే అక్రమ అరెస్టు అంటూ రైతులు ఆరోపణ



**ఉలవపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త** ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారని మండలంలోని కరేడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను మఫ్టీలో వచ్చిన పోలీసులు మాటేసి అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన సంఘటన సోమవారం జరిగింది. మఫ్టీలో వచ్చిన పోలీసులు ఏ ప్రాంతం వారు తెలియక కరేడు గ్రామానికి చెందిన రైతులు గ్రామ స్తులు ఆ గ్రామానికి చెందిన వ్యక్తుల అరెస్టుపై ఆం దోళన చెందారు. కరేడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ప్రస్తుతం కరేడు భూసేకరణ ఉద్యమా నికి వెన్నుదన్నుగా ఉన్న ఆ గ్రామ కాపరస్తుడు నల్లపురెడ్డి అజిత్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన శ్రీహరి అతని కుమారుడు నిరంజన్, బోగోలు మం డలం తిప్ప గ్రామానికి చెందిన రాజేష్‌లతో కలిసి కలిగిరి మండలం అగ్రిగోల్డ్ భూముల్లో ఎర్ర చంద నం కొట్టి అక్రమంగా తరలిస్తున్నారని కేసు నమో దు కావడంతో వారిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు అని మీడియా సమావేశంలో కలిగిరి సీఐ వెంకట నారాయణ, ఎస్సై ఉమాశంకర్‌లు పత్రికా విలేకర్ల సమావేశంలో వెల్లడించడంతో ఇదే విషయమై సోషల్ మీడియాలో ప్రచారం అయింది. దీంతో కరేడు గ్రామంకు చెందిన ముగ్గురు వ్యక్తుల్ని ఎవరు ఏ కేసులు అరెస్టు చేశారు అనే విషయం తేటతెల్లమైంది. అయితే కరేడు భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమంలో నల్లపురెడ్డి అజిత్‌రెడ్డి, ప్రముఖ పాత్ర పోషిస్తున్నాడని కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు బనాయించారని కరేడు గ్రామ రైతులు ఆరోపిస్తూ ఉలవపాడు పోలీసు స్టేషన్లో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను కలిసి తమ గోడు వెలబోసుకున్నారు. అక్రమ అరెస్టు చేసిన మఫ్టీలో వచ్చిన పోలీసులు ఏ ప్రాంతం నుంచి వచ్చారో తెలియదని అజిత్‌రెడ్డిని అరెస్టు చేసి ఎక్కడికి తీసుకెళ్లారు తెలియజేయాలని రైతులు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇదే విషయమై పూర్తి సమాచారం వెలుబడిందని ఏ ప్రాంత పోలీసులు అరెస్టు చేశారు. స్పష్టంగా చెప్పడం జరిగిందని, దీనిపై స్థానికంగా పోలీసులు ఎలాంటి సమాచారం లేదని తమ పోలీసులకు చెందిన కేసు కాదని రైతులకి స్పష్టంగా తెలియజేశారు.